కథ

"రామ లాలీ.... మేఘ శ్యామ లాలీ....
రామ లాలీ.... మేఘ శ్యామ లాలీ...."

పరమేశ్వరంగారు పాడుతూంటే ఆయన్ని అనుకరిస్తూ పాడుతున్నాడు ఆరేళ్ల బాబీ. వంటింట్లో పకోడీలు చేస్తున్న మాలతి ఆ పాటలకు చిరాకు పడిపోతోంది.

"ఖర్మ! ఈ ముసలాయనకు ఎన్ని సార్లు చెప్పినా మారడు సరికదా, అతడి ధోరణి అతనిదే" అనుకుంది.

బాబీ చదివేది ఇంగ్లీషు మీడియం కాన్వెంట్. అక్కడ వాడికన్నీ ఇంగ్లీష్ రైమ్స్ చెబుతూంటారు. తను కూడా వాడికి ఎన్నో రైమ్స్ నేర్పింది. కానీ వాడు... రాముడి పాటలే... వేమన పద్యాలే వల్లిస్తున్నాడు. వొట్టి పాత చింతకాయ పచ్చడి. అవే నేర్పుతాడీయన. అవును మరి.. ఆయన రోజుల్లో యిలాంటి పద్యాలూ, పాటలే తప్ప ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్లూ, జానీ

# మమతాను బంధం

- దేవిప్రియ

జానీ యస్ ప్పాప్పాలూ ఎక్కడివి? ఈ రైమ్స్ నేర్పడం ఆయన తరమౌనా?

బాబిగాడూ అంతే! ఎప్పుడూ ఆ కూని రాగాలు తప్పితే చక్కగా టీచర్స్ చెప్పిన రైమ్స్ పాడుకోరాదూ అంటే "నాకివే బావున్నాయమ్మా! తాతయ్య బలే బలే పద్యాలు చెబుతున్నాడు. ఈ పద్యాలు ఒక్కటంటే ఒక్కటీ మా టీచర్లకు రావు తెలుసా?" కళ్లెగరేస్తూ చెప్తాడు.

చంటి వెధవ! వాడికేం తెలుసు? ఆ ముసలాడు వీడినిలా పాడుచేస్తూంటే ఈయనకు చీమ కుట్టినట్లు కూడా వుండదు.

పైగా బాబిగాడి పిలుపొకటి, 'అమ్మా' అంటూ. తనకా పిలుపంటేనే కంపర మెత్తి పోతుంది. అమ్మా ఏంటి? బామ్మలాగా. చక్కగా 'మమ్మీ' అని పిలవమని చెబితే అమ్మా నాన్నలనే పిలవమంటాడు. అవే బాగుంటాయని మప్పుతాడు, ముసలాడికేం తెలుసు ఈ పిలుపుల్లోని ఆనందం?

ఆయనకంత మోజుగా వుంటే ఆయన కొడుకతన్ని



పిలుస్తున్నారుగా, రోజుకు పదిసార్లు 'నాన్నా, నాన్నా' అంటూ. ఈయనది మరీ విడ్డూరం! బాబిగాడి కన్న చిన్నవాడిలా ప్రవర్తిస్తారు. ఎప్పుడూ తండ్రి ధ్యాసే. ప్రొద్దస్తమానం ఆయన వెనకే,ఆయనతోనే!"నాన్నా కాఫీ తాగారా? నాన్నా వాకింగ్‌కు వెళ్లారా? నాన్నా ఒంట్లో ఎలా వుంటోం"దంటూ! చంటి వాళ్లు సైతం అమ్మా నాన్నలను వదలి కొంతసేపు ఆటపాటల్లో మునిగిపోతారు. ఈయనలా కాదు, ఎప్పుడూ ముసలాడి గురించే ఆలోచన! అతడు బాగానే వున్నాడుగా గుండ్రాయిలా! చక్కగా తిరుగుతున్నాడు, వేళకు అన్నీ ఆరగిస్తున్నాడు. ఇంకేం లోటు, బావుండక పోవడానికి?

ఆయన గారికన్నీ సమకూరుతున్నాయి. కానీ తనకే ఆ ముసలాడు పెద్ద అడ్డంకిలా తయారయ్యాడు.

తనూ, ఆయనా, బాబిగాడూ మాత్రమే కలిసి వుండే యోగం లేదు. ప్రతిదానికీ, ప్రతి పనికీ ఈ ముసలాడి సలహా తీసుకోవాలి.

పెద్దల మాట చద్ది మూట అంటాడు. ఆయన చెప్పినట్లు చెయ్యకపోతే ఒకటే సణుగుడు, 'పెదప కాలం, పెదప బుద్ధులూ' అంటూ.

బాబిగాడి విషయంలోనూ అంతే.

తను బోర్న్‌విటా కలిపియిస్తే పాలు మంచివి, అవే ఇవ్వమంటాడు. ముసలాడికి సాయంత్రం షికార్లు అలవాటు. ఈవెనింగ్ వాక్ అని చెప్పి బజార్లన్నీ బలాదూర్ తిరిగి వొస్తాడు. ఆయనొక్కడే ఎన్ని ఊళ్లు తిరిగొచ్చినా అభ్యంతరం లేదు, కూడా బాబిగాడ్ని తీసుకొని పోతాడు. వాడు చదువుకునే టైము, యిప్పుడెందుకు షికార్లు అంటే, వినడు. మనసుకు, శరీరానికి కాస్త ఉల్లాసంగా వుంటుందంటాడు.

తీసికెళ్లి చిల్లర తిళ్లు, చిరుతిళ్లు కొనిపిస్తాడు. బాబిగాడిచే తినిపిస్తాడు. ఏమిటని అడిగితే నా యిష్టమంటాడు.

ఈయనకెన్నో సార్లు చెప్పింది తను.

"మామగార్ని మనతో ఎందుకు, మీ చెల్లాయ్ దగ్గరకు పంపించెయ్యరాదూ?" అని.

"తండ్రి కొడుకుల దగ్గరుండటమే మంచిది. కొడుకులే తండ్రిని చూడటం న్యాయం. కూతురి దగ్గరకు ఏదో చుట్టపు చూపుగా వెళితేనే గౌరవం గాని, జీవితాంతం కూతురిపై ఆధారపడటం లోకధర్మం కాదు. అందుకని నాన్నగారిక్కడే ఉంటారు. పైగా నన్ను విడిచి ఆయనా, ఆయన్ను చూడకుండా నేనూ వుండలేము. ఆయన పెద్దవారు. వాన ప్రస్థంలో ఉన్నారు. ఆవయసులో చాదస్తం లేనివారు అరుదుగా వుంటారు. అందుకని ఆయన పనులు నీకు కష్టం కలిగిస్తే నాకోసం నువ్వు వాటిని భరించాలి. ప్లీజ్ మాలా!" అంటూ తన నోటిని కట్టి పడేస్తారు.

అయినా ఆ భరించడానికీ ఓ హద్దుంటుందిగా.

తనూ మనిషే. కోపతాపాలకీ, విసుగు విరామాలకీ తను అతీతురాలేం కాదు. తన సహనానికి ఓ పరీక్షలా తయారయ్యాడీయన.

చివరికి ఇవాళ ఒళ్లు మండి పోతోంది. తాడో పేడో తేల్చేసుకోవాలనే వెళ్లిందతని గదిలోకి.

❊ ❊ ❊ ❊

"చూడండి..."

"ఏమిటి?" పేపరు చదువుకుంటున్న మధు, తలెత్తి చూశాడు.

"ఇంక నేను ఈ న్యూసెన్సు భరించలేను..."

"ఏ న్యూసెన్స్?" ఆశ్చర్యంగా అడిగాడు మధు.

"అదే...మీ నాన్నగారు"-వెటకారంగా ధ్వనించిందామె కంఠం.

"ఏమైంది కొత్తగా యిప్పుడు?"

"కొత్తగా అవటం కాదు... ఎప్పటినుంచో వున్నదే. మీకెన్నోసార్లు విన్నవించుకున్నదే - ఆయన అలవాట్లు, పద్ధతులు అన్నీ చిరాకూ, చీదరమూ తెప్పించేవే. వేళకాని వేళల్లో కాఫీలూ, టీలూ కావాలంటారు. బాబిగాడికి బళ్లో చెప్పిన పాఠాలు కాకుండా తన కిష్టమైనవీ, పాతవీ, రోత పుట్టించేవి చెబుతాడాయన. వాడు చదువుకునే టైములో ఆయనతో పాటు బయట తిప్పుతారు. పడుకునే టైములో పద్యాలు వినిపిస్తారు. అమ్మమ్మ ఆటలూ, తాతయ్య కథలూ చెప్పి వాడిని రెండు తరాలు వెనక్కు నెట్టేస్తున్నారు. వాడికి నేనేం చెప్పినా ఆయన అడ్డుతగిలి ఉచిత సలహాలతో వాడిని పెడదోవ పట్టించేస్తున్నారు. వాడిని, వాడి పసి మనసును పాడు చేస్తున్నారు. ఇవన్నీ భరించలేక మీతో చెప్పుకున్నా మీరు నన్ను మాట్లాడనీయడం లేదు. కానీ, రోజు రోజుకు ఈ సణుగుడూ..సలహాలూ ఎక్కువైపోతూంటే ఇక భరించడం...సహించడం.. నావల్ల కాదు.

"ఏ వయసు వారా వయసు వారితో ఉండటమే వారికీ మిగిలిన వారికీ కూడా సుఖం. తక్షణం ఆయన్ని తీసికెళ్లి ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిస్తారో..నన్నూ బాబీనీ మా యింటికి పొమ్మంటారో తేల్చి చెప్పెయ్యండి. హోమ్‌లో ఉండేందుకార్థిక స్తోమత లేనివారేమీ కాదు వారు.."బ్రహ్మాస్త్రం సంధించినట్లే అందామె.

తనూ బాబీ కావాలో, తండ్రి కావాలో తేల్చుకోమన్నట్లు, తానింకేమీ మాట్లాడ దల్చుకోలేనట్లు ఖచ్చితంగా అందామె.

అతనొక్కసారి ఆమె ముఖంలోకి చూశాడు.

తను ఎన్నో సార్లు ఆమెకునచ్చజెప్పబోయాడు... వాదించాడు...లాభం లేకపోయింది.

ఆమె మనసు కరగదు.. ఆమె మారదు.

అతడికి అర్థమైపోయింది. దీర్ఘంగా నిట్టూర్చాడు. కుర్చీలోంచి లేచాడు.. ఒక నిర్ణయానికి వొచ్చినట్లు.

❊ ❊ ❊ ❊

అరగంటలో ఇంటి ముందో ఆటో ఆగింది.

దానిలోకి ముసలాయన అతని సామానూ...మధు ఎక్కారు. మాలతి మనసు పూలరథం ఎక్కినట్లు అయింది. మధు ఎక్కాక ఎక్కడి నుంచో పరుగెత్తుకు వొచ్చాడు బాబీ.

"నేనూ ఆటో ఎక్కుతాను డాడీ.."

"తీసుకెళ్లండి" అంది మాలతి.

ఆటో కదిలింది. ఆటోతో పాటు..ముసిలాయన.. వాటితో పాటూ తన పీడా వెళ్లిపోయాయి.. బ్రతుకు జీవుడా అనుకుంది మాలతి.

❊ ❊ ❊ ❊

"బాబీ ఏడీ?" గేటులోనే నిలదీసింది మాలతి. మధు మాట్లాడకుండా మౌనంగా తన గదిలోకి దారి తీశాడు.

అతడి వెనుకే వడివడిగా అడుగులేసుకుంటూ వొచ్చింది మాలతి.

"మిమ్మల్నేనండి, అడుగుతున్నది బాబీ ఏడీ?" అంది కొంచెం కంఠస్వరం పెంచి.

"నాన్నగారిని - హోమ్‌లో దింపాను" అతని కంఠం - బాధగా.

"మంచిది - కానీ నేనడుగుతున్నది బాబీ గురించి"

"హోమ్‌లోకి పంపుతూ నాన్నగారికి వీడ్కోలిస్తుంటే.. నా కళ్లలోకి నీళ్లు వొచ్చాయి.."

ఒక్క క్షణం ఆగి మళ్లీ చెప్పసాగాడు.

"మేము తండ్రీ కొడుకులమే కాదు... మంచి స్నేహితులం కూడా. ఆయనకి నేనంటే ఎంత ప్రేమా వాత్సల్యమో నాకాయనన్నా అంత అభిమానమూ, ఆపేక్షా. అవి - ఎన్నో ఏళ్లవి. కానీ యివాళ.. మేమిద్దరమూ సజీవులమై ఉండగానే విచిత్రంగా, విషాదంగా, విడిపోవలసి వొచ్చింది. ఎందుకో నీకూ తెలుసు.. నా తండ్రి నీకు అడ్డమూ, అసహ్యమూ అయిపోయాడు".

"నేనడిగిందేమిటి? మీరు చెబుతున్నదేమిటి?"

"ఇవాళ తండ్రిగా ఆయనా.. కొడుకుగా నేనూ ఎటువంటి పరిస్థితుల వల్ల విడిపోవలసి వచ్చిందో.. రేపు.. తండ్రిగా నేనూ కొడుకుగా బాబీ - యిలాటి పరిస్థితినే ఎదుర్కోవలసి రావొచ్చునేమోనని భయమేసింది, మా నాన్నగారికి వీడ్కోలు చెబుతుంటే. వారితో అనుబంధం పెంచుకున్నందువల్లనే కదా యివాళ ఇంత విచారమూ, బాధా, ఈ కన్నీళ్లూ. అనుభవం అయీ, తెలిసుండీ.. రేపీ నరక యాతనకు బాబీ నెందుకు గురిచేయాలి? పెంచుకున్న అనుబంధాలను తుంచుకునే రోజొస్తుందని తెలియని అమాయకపు పసి హృదయం వాడిది.

"దగ్గరయాక విడిపోవలసి వచ్చి బాధపడటం కంటే - మొదటి నుంచీ దూరంగానూ అంటీ ముట్టనట్లుగానూ వుంటే తరువాత అట్టే బాధ వుండదు కదా! అలాగనిపించి.."

"ఏం చేశారు వాడిని?" ఆత్రంగా అడిగిదామె.

"రెసిడిన్షియల్ స్కూల్లో చేర్పించి వచ్చాను. వాడి బట్టలూ పుస్తకాలూ సర్ది యిస్తే.. అందజేసి వస్తాను." నిర్లిప్తంగా అన్నాడతను.

త్రుళ్లి పడింది మాలతి.

"ఆ! వాడిని.. నాతో మాట మాత్రమైనా అనకుండా.. రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చారా? వాడేం దిక్కు మాలి పోయాడా? అనాథా? అమ్మానాన్నలం ఉండీ.. ఒంటరిగా.. హాస్టల్‌లో.. వాడికేం ఖర్మ?"

మధు నిర్లిప్తంగా నవ్వాడు.

"ఏవయసు వారా వయసు వారితో ఉంటేనే వారికీ యితరులకీ సుఖం కదా! మన కంటే పెద్ద వారైన మా నాన్న గారిలాగే మనకంటే చిన్నవాడయిన బాబీ కూడా.. మన మధ్య ఉండేందుకనరుక్కాడనిపించింది.."

నిశ్చేష్టురాలయిందామె. ❑